# కరెంట్ అఫైర్స్

## పెరిగిన సుప్రీంకోర్టు ధర్మాసనాలు

★ సుప్రీంకోర్టులో నలుగురు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారంతో వీరి సంఖ్య 28కి చేరింది. ఈ నేపథ్యంలో ధర్మాసనాల సంఖ్య పెంచాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ 2018 నవంబరు 13న నిర్ణయించారు. ఇప్పటివరకు 11గా ఉన్న ధర్మాసనాల సంఖ్య 14కు పెరిగింది. 12వ ధర్మాసనంలో జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ దీపక్ గుప్తా, 13వ ధర్మాసనంలో జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎంఆర్ షా, 14వ ధర్మాసనంలో జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అజయ్ రస్తోగి వాదనలు వింటారు.

★ నూతన రోస్టర్ విధానం నవంబరు 19 నుంచి అమల్లోకి వస్తుంది. ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను ప్రధానన్యాయమూర్తి వింటారు. సబ్జెక్టులవారీగా రోస్టర్ విధానాన్ని మాజీ సీజేఐ దీపక్ మిశ్రా 2018 ఫిబ్రవరిలో ప్రారంభించారు.

## నవ్యాంధ్రకు కొత్త చిహ్నం

★ ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అధికారిక చిహ్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2018 నవంబరు 14న ప్రకటించింది. అధికారిక అవసరాల కోసం మూడు రకాల చిహ్నాలను విడుదల చేసింది. బహుళ వర్ణంలో ఒకటి ఉండగా, నీలం, నలుపు - తెలుపు రంగుల్లో మిగతా రెండు చిహ్నాలు ఉన్నాయి.

★ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వినియోగించిన అధికారిక చిహ్నంలో పలు మార్పులు చేసి అమరావతి శిల్పకళ స్ఫూర్తితో దీన్ని తీర్చిదిద్దారు. అశోకుడి ధర్మచక్రాన్ని చిహ్నంలో ఏర్పాటు చేశారు. ధర్మచక్రం మధ్యలో పూర్ణఘటాన్ని ఏర్పాటు చేశారు. క్రీస్తుశకం ఒకటో శతాబ్దిలో ధాన్యకటక మహా చైత్యానికి విధికుడు అనే చర్మకారుడు ఈ పూర్ణఘటంను బహూకరించాడు.

★ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చిహ్నం మధ్యలో 'పూర్ణకుంభం' ఉండేది. కానీ ధాన్యకటక మహాచైత్యంలో ఉన్నది పూర్ణఘటమే తప్ప, పూర్ణకుంభం కాదని ఆ మేరకు అధికారిక చిహ్నంలో మార్పులు చేయాలని సాధారణ పరిపాలన విభాగం నిర్ణయించింది. ప్రముఖ స్థపతి, పురాతత్వ శాస్త్రవేత్త శివనాగిరెడ్డి తదితరులతో ఒక కమిటీని నియమించింది. వారి సూచనల మేరకు తగిన మార్పులతో అధికారిక చిహ్నాన్ని ఖరారు చేసింది.

## జీఎస్ఎల్‌వీ - మార్క్ 3 - డీ2 ప్రయోగం

★ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలోనే అత్యంత బరువైన జీఎస్ఎల్‌వీ-మార్క్ 3-డీ2 రాకెట్ 2018 నవంబరు 14న కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-29ను విజయవంతంగా అంతరిక్షంలోకి మోసుకెళ్లింది. భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి దీన్ని ప్రయోగించారు.

★ జీఎస్ఎల్‌వీ-మార్క్ 3-డీ2 ఐదో తరం వాహక నౌక. దీన్ని ఇస్రో అభివృద్ధి చేసింది. 4 వేల కిలోల బరువుండే ఉపగ్రహాలను భూబదిలీ కక్ష్యలోకి చేర్చేలా తీర్చిదిద్దారు. ఇది శ్రీహరికోట నుంచి చేపట్టిన 67వ వాహక నౌక ప్రయోగం.

★ జీశాట్-29 ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు. ఇది ఇస్రో రూపొందించిన 33వ సమాచార ఉపగ్రహం. కక్ష్యలోకి చేరిన బరువైన భారత ఉపగ్రహం (3,423 కిలోలు)గా పేరొందింది. ఇందులో అమర్చిన కేఏ, కేయూ బ్యాండ్ హైత్రోపుట్ ట్రాన్స్‌పాండర్ల వల్ల ఈశాన్యం, జమ్ము కశ్మీర్‌లలోని మారుమూల ప్రాంతాలకు సైతం అంతర్జాల సేవలు సులభతరమవుతాయి.

★ ఉపగ్రహంతో కలిపి రాకెట్ మొత్తం బరువు 640 టన్నులు. రాకెట్ ఎత్తు 43.4 మీటర్లు, వ్యాసం 4 మీటర్లు. ప్రయోగ దశలు మూడు (ఘన, ద్రవ, క్రయోజెనిక్). ఉపగ్రహ జీవిత కాలం 10 ఏళ్లు.

★ 2017 జూన్ 5న ఇస్రో బాహుబలి-1 (జీఎస్ఎల్‌వీ-మార్క్ 3-డీ1)ని తొలిసారిగా ప్రయోగించింది. దీంతో 3136 కిలోల దేశీయ కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-19 ని విజయవంతంగా కక్ష్యలోకి చేరవేశారు.

## మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి వందేళ్లు

★ మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి వందేళ్లు పూర్తయిన సందర్భంగా 2018 నవంబరు 11న పారిస్‌లో ప్రపంచ దేశాల అధినేతలు కలిసి యుద్ధంలో చనిపోయిన సైనికులకు నివాళులు అర్పించారు. పారిస్‌లోని చాంప్స్-ఎలైసెస్‌లో ఉన్న యుద్ధ స్మారకం 'ఆర్క్ డి ట్రియంఫె' వద్ద ఈ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

★ మొదటి ప్రపంచ యుద్ధం 1914 జులై 28న ప్రారంభమై 1918 నవంబరు 11న ముగిసింది.

★ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ నేతృత్వంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఇంగ్లండ్ రాణీ క్వీన్ ఎలిజబెత్-2, ప్రధాని థెరిసా మే, ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహా మొత్తం 70 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏపీలో సీబీఐకి ప్రవేశం నిరాకరణ

★ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి రాష్ట్రంలో సోదాలు, దర్యాప్తు చేసే అధికారాన్ని నిరాకరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఆ సంస్థ ప్రవేశానికి వెసులుబాటు కల్పించే 'సమ్మతి' ఉత్తర్వును ఉపసంహరించుకుంది. అంతర్గత విభేదాలతో సీబీఐ ప్రతిష్ఠ మసకబారిందని, రాష్ట్రంలో ఆ సంస్థ ప్రమేయం అవసరం లేదని భావించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం - 1946 ప్రకారం కేంద్రం సీబీఐని ఏర్పాటు చేసింది. దీని ప్రకారం దిల్లీ మినహా ఏదైనా రాష్ట్రంలో సీబీఐ తన అధికారాలను వినియోగించుకోవాలంటే ఆయా రాష్ట్రాలు సాధారణ సమ్మతి (జనరల్ కన్సెంట్) తెలపాల్సి ఉంటుంది. 2018 ఆగస్టు 3న రాష్ట్రం ఇచ్చిన సమ్మతి నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటూ ఏపీ ప్రభుత్వం 2018 నవంబరు 15న ఉత్తర్వులు జారీచేసింది.

## ప్రధాని మోదీ సింగపూర్ పర్యటన

★ 2018 నవంబరు 14, 15న ప్రధాని మోదీ సింగపూర్‌లో పర్యటించారు. నవంబరు 14న సింగపూర్‌లో జరిగిన 3వ ఫిన్‌టెక్ సదస్సులో పాల్గొని కీలకోపన్యాసం చేశారు. 2016 నుంచి ఏటా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రెండు వందల కోట్ల మందికి బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన 'అపిక్స్' (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ ఎక్స్ఛేంజ్) బ్యాంకింగ్ టెక్నాలజీ ప్లాట్‌ఫాంను సింగపూర్ డిప్యూటీ ప్రధాని టి. షణ్ముగరత్నంతో కలిసి మోదీ ఆవిష్కరించారు.

★ నవంబరు 15న సింగపూర్‌లో జరిగిన 13వ తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు (ఈఏఎస్) లో ప్రధాని మోదీ ప్రసంగించారు. తూర్పు ఆసియా కూటమిలో 'పది ఏషియాన్' దేశాలు (బ్రూనై, కాంబోడియా, లావోస్, మయన్మార్, ఇండోనేషియా, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, ఫిలిప్పీన్స్, వియత్నాం)తోపాటు భారత్, ఆస్ట్రేలియా, చైనా, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, రష్యా, అమెరికాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఏషియాన్) - భారత్ శిఖరాగ్ర సదస్సులోనూ మోదీ పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ వార్షిక పదంగా 'టాక్సిక్'

★ ఆక్స్‌ఫర్డ్ వర్డ్ ఆఫ్ ద ఇయర్ - 2018 గా 'టాక్సిక్' ఎంపికైంది. వివిధ సందర్భాల్లో, సంఘటనల్లో గత ఏడాది కాలంగా ప్రజలు ఈ పదాన్ని విస్తృతంగా వాడుతున్నట్లు సంస్థ పేర్కొంది. వాస్తవానికి విషపూరిత పదార్థాలను సూచించడానికి ఉపయోగించే ఈ పదాన్ని వాస్తవ వినియోగ పరిధిని దాటి కార్యాలయాలు, పాఠశాలలు, సంస్కృతులు, మానవ సంబంధాలు, ఇలా దేన్ని వివరించడానికైనా ఇదే పదాన్ని వాడుతున్నట్లు వెల్లడించింది. 'టాక్సిక్ మాస్క్యులినిటీ' అనే పదాన్ని 'మీటూ' ఉద్యమం వెలుగులోకి తెచ్చిందని గుర్తుచేసింది.

## సూపర్ హీరోల సృష్టికర్త మృతి

✪ స్పైడర్ మ్యాన్ తదితర సూపర్ హీరోల సృష్టికర్త, హాలీవుడ్ మేటి రచయిత, ఎడిటర్, పబ్లిషర్ స్టాన్‌లీ (95) 2018 నవంబరు 12న లాస్‌ఏంజిల్స్‌లో మరణించారు.

✪ స్పైడర్ మ్యాన్, ఐరన్ మ్యాన్, ఎక్స్-మెన్, ఫెంటాస్టిక్ ఫోర్, ఇంక్రెడిబుల్ హల్క్, బ్లాక్ పాంథర్ లాంటి సూపర్ హీరో పాత్రలు ఈయన సృష్టించినవే. 1922 డిసెంబరు 28న న్యూయార్క్‌లో జన్మించిన స్టాన్‌లీ 1961లో మార్వెల్ కామిక్స్‌లో చేరారు. అదే సంవత్సరంలో తొలిసారిగా 'ద ఫెంటాస్టిక్ ఫోర్' పేరుతో క్యారెక్టర్లను సృష్టించిన ఆయన ఆ తర్వాత ఎన్నో సూపర్ హీరో పాత్రలకు ప్రాణం పోశారు.

✪ హాలీవుడ్‌లో 'ఫాదర్ ఆఫ్ పాప్ కల్చర్'గా స్టాన్లీ ఖ్యాతి గాంచారు. డాక్టర్ స్ట్రేయింజ్, కెప్టెన్ అమెరికా వంటి కామిక్ క్యారెక్టర్లను కూడా ఆయన సృష్టించారు.

## కేంద్రమంత్రి అనంతకుమార్ మరణం

- ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న కేంద్ర రసాయనాలు, ఎరువులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్.ఎన్. అనంతకుమార్ (59) 2018 నవంబరు 12న బెంగళూరులో మరణించారు. 1996లో భాజపా నుంచి లోక్‌సభ సభ్యుడిగా పార్లమెంటులో ప్రవేశించారు. అప్పటినుంచి వరుసగా ఆరుసార్లు ఎంపీగా బెంగళూరు దక్షిణ నుంచి గెలుపొందారు. అనంత కుమార్ మరణంతో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న నరేంద్ర సింగ్ తోమర్‌కు పార్లమెంటరీ వ్యవహారాల శాఖను; గణాంకాలు, పథకాల అమలు శాఖ మంత్రి సదానంద గౌడకు ఎరువులు, రసాయనాల శాఖల బాధ్యతలను అప్పగించారు.

## తొలి దేశీయ జల రవాణా వ్యవస్థ ప్రారంభం

గంగానదిపై నిర్మించిన తొలి దేశీయ జలరవాణా వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసిలో 2018 నవంబరు 12న ప్రారంభించారు. దేశంలో తొలిసారిగా వారణాసిలోని గంగానదిపై నిర్మించిన మల్టీ మోడల్ టెర్మినల్‌ను ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. సరకు రవాణాకు సముద్ర మార్గాలు ఉన్నప్పటికీ, తొలిసారిగా దేశం లోపల జల రవాణాకు సంబంధించిన నౌకా మార్గాన్ని ప్రభుత్వం గంగానదిపై ఏర్పాటు చేసింది. వారణాసి (ఉత్తర్ ప్రదేశ్), కోల్‌కతాలోని హల్దియా (పశ్చిమ్ బంగ) మధ్య సరకుల రవాణాతో పాటు ప్రజారవాణాకు ఉపయుక్తంగా దీన్ని నిర్మించారు. దేశీయ జల రవాణాను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన నాలుగు జల రవాణా మార్గాల్లో ఇది మొదటిది. ప్రపంచ బ్యాంక్ సహకారంతో రూ. 5,369 కోట్లతో ఈ 'జల మార్గ్ వికాస్' ప్రాజెక్టును కేంద్రం చేపట్టింది.

**రచయిత: సీహెచ్ కృష్ణప్రసాద్**